క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పరమేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనికేపాడు ప్రధాన రహదారి, జెండాచెట్టు సెంటర్, విజయ ఆగ్రో కట్ట, ఎస్సీ కాలనీ, రైల్వేకట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి గ్రామ సభలు

విజయవాడరూరల్: రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి గ్రామ సభలు జరుగుతాయని రూరల్ మండల తహసీల్దార్ బి.సుగుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన షాబాదు, 23న వేమవరం, 24న పైడూరుపాడు, 25న కొత్తూరు, 26న రాయనపాడు, 28న తాడేపల్లి, 29న జక్కంపూడి, 30న అంబాపురం, నవంబరు 1వ తేదీన పి.నైనవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడ జరుగుతుందని పేర్కొన్నారు. భూముల రీ సర్వేకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గ్రామ సభల ద్వారా ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. గ్రామసభల్లో ఆయా గ్రామాల రైతులు పాల్గొనాలని తహసీల్దార్ సూచించారు. గ్రామ సభల్లో మండల తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్, వీఆర్వో, మండల, గ్రామ సర్వేయర్లు పాల్గొంటారని తెలిపారు.

రెచ్చిపోతున్న చిల్లర దొంగలు

గన్నవరం: చిరు వ్యాపారులే లక్ష్యంగా గన్నవరం ప్రాంతంలో చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళలో టీస్టాల్స్, బడ్డీ కొట్లు, కూరగాయల దుకాణాల తాళాలు పగులకొట్టి అందినకాడికి దోచుకుపోతున్నారు. స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని జెడ్పీ బాలుర హైస్కూల్ సమీపంలోని టీస్టాల్ తాళాలను శనివారం రాత్రి పగులకొట్టారు. బిస్కెట్ ప్యాకెట్లు, చాకెట్ల డబ్బాలను ఎత్తుకుపోయారు. టీస్టాల్ సమీపంలోని కూరగాయల దుకాణంలో కూడా చోరీకి విఫలయత్నం చేశారు. అయితే తాళాలు రాకపోవడంతో వదిలివేశారు. స్థానిక ఐసీఐసీఐ బ్యాంక్ సమీపంలోని సిగరెట్ల దుకాణంలో కూడా పలుసార్లు చోరీకి పాల్పడ్డారు. అదే విధంగా దావాజీగూడెం రోడ్డులోని పలు దుకాణాల్లో జరుగుతున్న వరుస చోరీలతో వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో నిఘా పెంచాలని వ్యాపారులు కోరుతున్నారు.

తమ్ముడిపై అన్న దాడి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో తమ్ముడిపై అన్న దాడి చేయడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు వైఎస్సార్ నగర్‌లో నున్నావత్ కుమార్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. తండ్రి నుంచి వచ్చిన ఇంటి వాటాలో పక్క పోర్షన్‌లో అన్న నున్నావత్ కోటేశ్వరరావు కూడా ఉంటున్నాడు. అయితే ఇంటికి కరెంట్ మీటర్ కలిసే ఉంది. గతంలో కుమార్ తన అన్న వద్ద రూ. 5 వేలు అప్పు తీసుకోవడంతో కొంతకాలంగా కరెంట్ బిల్లు కుమార్ కట్టాడు. అయితే తీసుకున్న అప్పు తీరిపోయిందని ఈనెల కరెంట్ బిల్లు కుమార్ కట్టలేదు. దీంతో అన్న కోటేశ్వరరావు ఇంటి కరెంట్ కనెక్షన్ తీశాడు. దీంతో కుమార్ అన్న కోటేశ్వరరావును ప్రశ్నించడంతో కోటేశ్వరరావు, అతని కుమారుడు కిరణ్‌కుమార్ కర్రతో కుమార్‌పై దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

24న జాతీయ ఆక్యుపంక్చర్ డే

పెనమలూరు: కానూరులో ఈనెల 24వ తేదీన జాతీయ ఆక్యుపంక్చర్ డే నిర్వహించనున్నట్లు ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ భారత్(ఏఎస్‌పీఏ) ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్యుపంక్చర్ వైద్యాన్ని ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. ప్రజల్లో ఆక్యుపంక్చర్ వైద్యంపై అవగాహన పెంచడానికి చర్యలు చేపట్టామని అన్నారు. 24వ తేదీన కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఆక్యుపంక్చర్ డే సందర్భంగా పలు కార్యాక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వంతెన చింత తీరేదెలా.!

- లంబాడ బాట వాగుపై వంతెన నిర్మించాలని రైతుల వినతి
- ఆక్రమణలు, వ్యర్థాలు, ముళ్లకంప తొలగించాలని డిమాండ్

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద లంబాడ బాట వాగుపై వంతెన నిర్మించాలని ఆ గ్రామస్తులు, రైతులు ఎంతో కాలంగా కోరుతున్నారు. స్థానిక హైస్కూల్ క్రాస్ రోడ్డు వద్ద ఈ వాగుపై దశాబ్దాల క్రితం కాజ్‌వే నిర్మించారు. అప్పటి నుంచి ఈ కాజ్‌వేనే రాకపోకలకు ఉపయోగపడుతోంది. అయితే వర్షాలు, వరదలు వచ్చిన సమయాల్లో ఈ కాజ్‌వేపై నుంచి ఉధృతంగా నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూరంపల్లి ఎగువ నుంచి చెరువుల నీరు, పంట చేలల్లో అధికంగా ఉన్న నీరు ముస్తాబాద పెద చెరువుకు వచ్చి చేరుతుంది. ఆ చెరువు కళింగ పొంగి నీరు పంట కాలువ ద్వారా లంబాడ బాట వాగులోకి ప్రవహిస్తుంది. ఇక్కడి నుంచి ముస్తాబాద పేడ చెరువుకు ఈ నీరు చేరుతుంది.


ఆక్రమణలతో స్వరూపం కోల్పోతున్న లంబాడ బాట వాగు

గతంలో పలు ప్రమాదాలు

గతంలో కురిసిన వర్షాల కారణంగా ఈ వాగులో తండ్రి కుమార్తె కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. సూరంపల్లి నుంచి ముస్తాబాద వస్తూ లంబాడ బాట వాగు ఉధృతిలో ద్విచక్ర వాహనంతో ప్రవేశించి వాగులో పడిపోయి ప్రాణాలు పోగొట్టుకున్నారు. పలు వాహనాలు పడిపోవడం, కొట్టుకుపోవడం అనేక సార్లు జరిగింది.

వాగు ఆక్రమణలు తొలగించాలి

హైస్కూల్ క్రాస్ రోడ్డు నుంచి నున్న వెళ్లే మార్గంలో ఉన్న లంబాడ బాట వాగు ఆక్రమణలకు గురి అయ్యింది. అంతేగాక వాగులో పెద్ద పెద్ద చెట్లు మొలిచాయి. పిచ్చి కంపతో నిండి ఉంది. ఈ కారణంగా వరద నీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. ఈ వాగు వెంట వందల ఎకరాల్లో సాగు భూములు ఉన్నాయి. ఆ భూములు పండించేందుకు ఆధారంగా ఉన్న వాగు ఆక్రమణలు, కంప చెట్లు తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు లంబాడ బాట వాగు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతున్నారు.


ముస్తాబాద-సూరంపల్లి లంబాడ బాట వాగు కాజ్‌వే


వాగులో పెరిగిన కంప చెట్లు


నీటి ప్రవాహంలో పెరిగిన ముళ్ల పొదలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెనమలూరు: యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో జీవించగలుగుతామని యోగా గురూజీ దీటి మల్లికార్జున నరసింహారావు అన్నారు. శ్రీవెంకటేశ్వర యోగా కేంద్రం ఆధ్వర్యంలో పెనమలూరు కిలారు అనీల్ ఎస్టేట్‌లో ఆదివారం 63వ ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. యోగా అన్ని వయస్సుల వారు చేయవచ్చని తెలిపారు. యోగా చేయడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండగలుగుతామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందని తెలిపారు. 28 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరూ యోగా శిక్షణలో పాల్గొని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మల్లికార్జున నరసింహారావు

డ్రెయిన్లలో వ్యర్థాల తొలగింపు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం సుగాలీ కాలనీలోని డ్రెయినేజీ కాల్వల్లో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఆదివారం వ్యర్థాలను తొలగించే పనులు నిర్వహించారు. సుగాలీ కాలనీలో పలువురు డెంగీ జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్నారు. పలువురు కాలనీవాసులు డ్రెయినేజీల్లో వ్యర్థాలు ఎక్కడవి అక్కడే ఉండటం, దోమల బెడద అధికంగా ఉంటోందని వాటి ప్రభావంతో వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు డ్రెయినేజీ కాల్వలను శుభ్రం చేస్తున్నారు. సుగాలీ కాలనీ పల్లంగా ఉండటంతో ఎప్పుడు వర్షాలు కురిసినా రోడ్డుపై నుంచి వర్షం నీరు కాలనీ వైపు వచ్చి నిల్వ ఉండటం జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. సుగాలీ కాలనీలో రోడ్లు మెరక చేసి డ్రెయినేజీ కాల్వలు వాటికి అనుగుణంగా నిర్మించాలని స్థానిక ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


నున్న సుగాలీ కాలనీలో డ్రెయినేజీ కాల్వల్లో వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

అయానాకు హెచ్‌వైఎం సంస్థ 5స్టార్ రేటింగ్

కంకిపాడు: కంకిపాడులోని అయానా ఫంక్షన్ హాలుకు యూకేకు చెందిన హెచ్‌వైఎం సంస్థ 5 స్టార్ రేటింగ్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసింది. స్థానిక ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేతులమీదుగా అయానా చైర్మన్ యార్లగడ్డ మనోజ్, ఎండీ యార్లగడ్డ రాజశేఖర్ ధ్రువీకరణ పత్రం, 5 స్టార్ రేటింగ్ అవార్డు అందుకున్నారు. సేవలు, వసతులు, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత అంశాల్లో అయానా ఫంక్షన్ హాల్‌కు 5 స్టార్ రేటింగ్ ఇస్తున్నట్లు హెచ్‌వైఎం సంస్థ జాతీయ ప్రతినిధి ఆలపాటి శివయ్య తెలిపారు. శివయ్య మాట్లాడుతూ నిర్వహణ (ఐఎస్ఓ-9001), పచ్చదనం (ఐఎస్ఓ-4001), ఆహారంలో నాణ్యత, తయారీలో పరిశుభ్రత (ఐఎస్ఓ-2200) ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట 5 స్టార్ రేటింగ్ ఇస్తూ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తున్నట్లు తెలిపారు.


మాజీ ఉపరాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న అయానా ప్రతినిధులు

గ్రామాభివృద్ధికి పల్లె పండుగ వారోత్సవాలు

గన్నవరం రూరల్: గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి సాధనకు ప్రభుత్వం పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెంపల్లి, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, గొల్లనపల్లి, మాదలవారిగూడెం, సూరంపల్లి, ముస్తాబాద, పురుషోత్తపట్నం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలతో పండుగ వాతావరణం నెలకొందన్నారు. తెంపల్లిలో రూ. 35లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, సర్పంచ్ కొలుసు శిరీషా, ఎంపీటీసీ సభ్యురాలు జొన్నలగడ్డ రంగమ్మ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


తెంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పెనమలూరు: భార్యతో ఉన్న గొడవల కారణంగా భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. తాడిగడప 100 అడుగుల రోడ్డులో పట్నాల నాని భర్త శ్రీనుతో ఉంటుంది. వీరు గత కొద్ది నెలలుగా అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు. కాగా భర్త తరచుగా మద్యం సేవించడంతో భార్య నాని గత మూడు రోజుల క్రితం నారాయణపురం కాలనీలో ఉంటున్న అత్త వద్దకు పిల్లలతో వచ్చింది. అయితే ఆదివారం భర్త శ్రీను పని చేస్తున్న అపార్టుమెంట్ వాసులు ఫోన్ చేసి శ్రీను వాచ్‌మెన్ రూమ్‌లో ఉరేసుకుని చనిపోయాడని తెలిపారు. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా శ్రీను చనిపోయి ఉన్నాడు. కేవలం మద్యానికి బానిసగా మారి తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోరంకిలో మంచి నీటికి కటకట

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పరిపాలన నానాటికి ప్రజలకు సమస్యగా మారుతోంది. గత వారం రోజులుగా మున్సిపాలిటీ పరిధిలో చెత్త కుప్పలు ఎత్తేవారు లేక గ్రామాలు కంపు కొడుతుండగా తాజాగా పోరంకిలో ఆదివారం కుళాయిల్లో మంచినీరు రాలేదు. దాదాపు 10 వేల మంది జనాభాకు నీరు అందలేదు. పైప్‌లైన్ల మరమత్తులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముందస్తు సమాచారం లేకుండా నీటి సరఫరా నిలుపుదల చేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ పని తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ఇళ్లల్లో చెత్త తీసుకువెళ్లలేదని, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చోడవరంలో కుంతీదేవి మహోత్సవం

పెనమలూరు: చోడవరం గ్రామంలో ఆదివారం కుంతీదేవి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దళితవాడ రాయాలయం వద్ద భక్తులు మట్టితో కుంతీదేవి విగ్రహాన్ని రూపొందించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు ఆయురారోగ్యం, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు పూజించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రేపటి నుంచి ఆధార్ క్యాంపులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామ సచివాలయాల్లో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు చేర్పులు, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలు ఈ క్యాంపుల్లో అందిస్తారని చెప్పారు. దీని కోసం మూడు ప్రత్యేక బృందాలు నాలుగు రోజుల పాటు మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తారని వివరించారు. 22వ తేదీన ఆరుగొలను, కానుమోలు, బాపులపాడు-3 గ్రామ సచివాలయాల్లో, 23న వేలేరు, వీరవల్లి-2, రంగన్నగూడెం, 24న పెరికీడు, మల్లవల్లి, బొమ్ములూరు, 25న కొత్తపల్లి, ఎ.సీతారామపుర, కోడూరుపాడులో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

ముగిసిన పాథాలజీ సదస్సు

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పాథాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు జరిగిన ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ శిక్షణ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో రక్తం, మూలకణజాల చికిత్సలపై నిపుణులు అవగాహన కల్పించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్, క్లినికల్ థెరపీలలో పురోగతిపై వక్తలు సందేశమిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ దేబాసిస్ మిశ్రా, చైతన్య కుమార్, శ్రీకాంత్, నవీన్ చంద్ర, జాస్మిన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ ఎస్ఐగా సురేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ఎస్ఐగా వి. సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడగా సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఏడీఎల్ జనార్ధన్ గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సురేష్‌ను నియమించారు. హనుమాన్‌జంక్షన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సురేష్ పోలీస్ ఉన్నతాధికారులను, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

సూరంపల్లిలో వైద్య శిబిరం

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 189 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్లు జ్యోతి, గీతిక తదితరులు సేవలందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి గౌరవ అధ్యక్షుడు వీఆర్ శర్మ, సచివాలయ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పెనమలూరు: వివాహిత అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు కమలమ్మబజార్ సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన మొవ్వా సీతారామయ్య కుటుంబ సభ్యులతో ఉంటూ ఆటోనగర్‌లో వెల్డింగ్ పనులు చేస్తాడు. ఈనెల 18వ తేదీన అతను ఆటోనగర్‌కు పనికి వెళ్లాడు. సాయంత్రం అతను ఇంటికి వచ్చి చూడగా భార్య జోజమ్మ(32) ఇంట్లో కనబడలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా జాడ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యంపై కేసు

పెనమలూరు: బీటెక్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప పద్మాజానగర్‌కు చెందిన వేమారెడ్డి శివకుమారి స్వస్థలం గిద్దలూరు మండలం కొమరవోలు గ్రామం. అయితే పిల్లల చదువు కోసం తాడిగడపలో ఉంటున్నారు. పెద్దకుమారుడు వేమారెడ్డి విశ్వేశ్వరరెడ్డి బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతను పుస్తకాలు కొనాలని ఈనెల 19వ తేదీన విజయవాడుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో తల్లి శివకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

400 మందికి కంటి వైద్య పరీక్షలు


పెనమలూరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెనమలూరు: పెనమలూరులో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యం శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. తానా కోఆర్డినేటర్ ఠాగూర్ మల్లినేని మాట్లాడుతూ తాము అమెరికాతోపాటు జన్మభూమిలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉయ్యూరు రోటరీ సహకారంతో తాము ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అలాగే పేద రైతులకు పవర్ స్ప్రేయర్లు, రక్షణ పరికరాలు, మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. భవిష్యత్తులో తానా సేవలు మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. తానా ప్రతినిధులు రాజా కుసుమర్తి, శశికాంత్ వల్లేపల్లి, రమణ అన్నే, ప్రసాద్ కొల్లి సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తున్నారని చెప్పారు. కాగా వైద్య శిబిరంలో ఎన్నారై ప్రతినిధులు కిలారు ప్రవీణ్, మోర్ల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.